స్కెచ్

# ఇద్దరు ప్రాద్వాకులు

కె. రామలక్ష్మి

చిన్న రేడియోలోనుండి పెద్దగా సంగీతం వినవస్తూన్నంత మాత్రాన రూము వేడెక్కుతుందా పిచ్చిగాని! కాని, అది దారుణమైన నిశ్శబ్దం కంటేనయమే. సంగీతం రూముని వేడెక్కించక పోయినా నిశ్శబ్దం వాతావరణాన్ని మరీ చల్లబరిచేస్తుంది. దానితో మనుషులలో బతకాలనే వాంఛ చచ్చిపోతుంది. అందుకే చిన్న రేడియోలోంచి పెద్దగా సంగీతం వస్తూంటే వినడమే నయం.

సమస్తమూ తాము కోరుకున్నట్లే వున్నా ఇంకా ఏదో అసంతృప్తి. అందరికి కావలసినదీ ఒకటే - అందరూ కోరుకొనేదీ, ఎవరికీ లభ్యం కానిదీని. అలాంటి దేమైనా వుంటుందా అంటే: ఆ, ఉండకేం అంటుంది ప్రతిహృదయమూ.

మానవుడు మానవుడే, ప్రతి మానవుడికీ - ఏ యితరుడూ ఎప్పుడూ కోరుకోనంతగా యీ ప్రపంచంలో కోరుకోతగినవన్నీ కావాలి. అలాగే అన్నీ లభిస్తే యీ ప్రపంచంలో అందరూ హాయిగానే వుంటారు. కాని కర్మవశాత్తూ ఉన్న కాస్త వ్యవధిలోనూ తొంభైపాళ్లు కావలసిన వాటికీ కోరుకొన్న వాటికీ దూరంగానే వుండిపోయి కాలక్షేపం చేసేయవలసి వస్తూంది! అందుకే ఏమాత్రం అవకాశం లభించినా పిచ్చెత్తినవాడిలా మానవుడు వాటివెంట పరుగెడితే తప్పేముంది? అందుకే అసంతృప్తికీ అశాంతికీ అన్నిటికీ కారణం యీ హృదయమే...క్షణక్షణానా ముక్కలై పోవడానికి సంసిద్ధమయ్యే యీ హృదయమే.

అలా అనిపించినప్పుడల్లా నాకు రామయ్యగారు జ్ఞాపకం వస్తారు. వయస్సులో వున్న కుర్రాళ్లని చుస్తూ కూర్చోపెట్టుకొని తన వయసునాటి విషయాలు కథలుగా చెప్తూ...చుట్ట కాలుస్తూ రామయ్యగారు నాకు బాగా జ్ఞాపకం. ఫలానా కలక్టరుకి అన్ని హంగులూ ఎలా క్షణాలమీద రడీ చేశారో, పోలీసు లాకప్‌లోవున్న 'కాంగ్రెసోణ్ణి' ఎలా చావచితక కొట్టించారో, అదే క్షణంలో 'వాణ్ణి' చూసి ఆయన హృదయం ఎలా ద్రవించిపోయేదో, జవానులమీద ఎలా గర్జించేవారో గర్జించేసరికి వాళ్లెలా ఒణికిపోయేవారో...అన్నీ భూతకాలంలోకి భూతద్దంలోనించి చూసి చెప్పేస్తున్నట్లు చెప్తూ వుండేవారు.

'అయినా ఏమిటో, అన్ని హంగులూ చేతుల్లో వుండీ అందరు పెద్దలు నా చేతులలోనుంచి దాటేవారా, అయినా చూడు, ఆ యినస్పెక్టరు సంపాదించినంత అయినా నే సంపాదించలేక పోయాను. మరి నేనే చేయలేక పోయానంటే మా గోవిందం ఏంచేస్తాడో!' అంటూ నిస్పృహతో రామయ్యగారు నిట్టూరుస్తూంటే - పండిపోయిన ఆయనకే యింత అసంతృప్తా అనిపిస్తుంది. కాని నిజానికి ఆయనదే అసంతృప్తి! చేయగల్గిన రోజులలో చేసుకోలేక పోయానని ఆయన హృదయం అలా వుండివుండి ముక్కలవుతూనే వుంటుంది. అందుకే, డబ్బు కర్చుచేయడం అంటే ఆయనకి భయం.

“నువ్వు ఉద్యోగంలో ఉన్నప్పుడు నిన్నేమనే వారో చెప్పకూడదూ నాన్నా” అంటూ గోవిందం వచ్చేవాడు. గోవిందం భయభక్తులతో పెరిగిన పిల్లవాడు. ముప్ఫమో సంవత్సరంలోవున్న యువకుడు గోవిందం.

“చెప్పడానికి నాకేం భయంలేదుగాని, ఎందుకులే అనిపిస్తుంది” దీర్ఘంగా ఆలోచనలో మునిగినట్లు తనలో తనే మాట్లాడు కుంటున్నట్లు అంటారు రామయ్యగారు... “నన్ను లోభిననేవారు. వెధవ పనులన్నీ చేసి దాత అనిపించుకొనే కంటే అదే నయంకాదూ? భోగంవాళ్ళ దగ్గిర డబ్బు గుంజుకొని ప్రతి శుక్రవారం దేవాలయానికి వెళ్ళివచ్చే ఇనస్పెక్టరుని నే నెరుగుదును”... అంటూవుంటే ఆ యినస్పెక్టరు ఎదురుగా వున్నంత అసహ్యంగానూ ఆయన ముఖకవళికలు మారుతూండేవి. అది చూసి గోవిందం “నాన్నా, చూడు, అన్ని విధాలా నీలాగే పైకి వద్దామనేగా నా తాపత్రయ

మూను. అన్ని అవకాశాలూ నాకిస్తున్నావుగా?." అంటే, రామయ్యగారికి ములుకు గుచ్చుకొన్నట్లయేది. ఇదెలా తెలిసిందంటారా? కొడుకుమాటలు పూర్తి కాకుండానే ఆయన అనేవాడు: "అలా ఎప్పుడూ మాట్లాడకురా అబ్బాయి, నేను నీకేమి ఇవ్వకల్గుతున్నాను? ఎన్ని డిగ్రీలు సంపాదించినా ఓ ఆఫీసులో కూర్చుని పనిచేయడం నేర్చుకు తీరాలిగా. అదే చేతరావడంలేదు నీకు." తండ్రి బాధకి నవ్వొచ్చింది గోవిందానికి. "నా కలా ఇష్టమే లేదు నాన్నా. నా బుర్ర అందులో పని చెయ్యదు." గోవిందం మధురస్మృతుల జ్ఞాపకాలు ముఖంలో కనిపిస్తూంటే ఇంకా అంటాడు "నాన్నా, ఏదేనా పేరు సంపాదించాలనివుంది నాన్నా. ఎంతమంది అమ్మాయిలో..." గోళ్లు గిల్లుకుంటూ చెప్పతలచుకున్నది పూర్తి చేయకుండానే వూరుకుంటాడు గోవిందం.

చిరునవ్వుతో, చుట్ట అవతలపారేసి "ఆడదాని పేరెత్తితేనే తప్పులేదోయి వెధవాయి" అంటూ రామయ్యగారు అక్కడ కూర్చున్న మాలాంటి వాళ్ళకేసి చూస్తూ "చూడండోయ్, నన్నెలా బుట్టలో వేద్దామని చూస్తూన్నాడో./ నా కిప్పుడు అరవై నిండాయి. నా ముప్ఫయో ఏటవాడు పుట్టేడు. అప్పటికే యీ ప్రపంచంలో ఎన్ని చూశానో యీ వెధవాయి కేం తెలుసు?

నే యిరవయి అయిదో ఏట పెళ్లి చేసుకున్నాను...దానికి కారణం యీ హృదయమే అనుకో. తరువాత, యిన్ని సంవత్సరాలుగా యీ హృదయం ఎన్నిసార్లు పగిలిపోయిందో చెప్పలేను. యీ జీవితంలో ఏంచేసినా చివరికి తృప్తి కలుగదనుకో. నేనేదో కాలం గడిపేశానా, యీ గోవిందం చూడు, ఏమేమిటో వాగుతాడు. ఆడవాళ్లట! ప్రేమిస్తే ఏమొస్తుంది? ఏముంది ప్రేమలో? క్షణక్షణం వెయ్యి ముక్కలయిపోడానికి సిద్ధమవే నీ హృదయానికి తోడు యింకోటి కూడా ఎందుకు?...అందులోనూ కోరి తెచ్చుకోవడం! పోనీ అని ఆత్మశాంతికి సంఘసేవ చేద్దాం అనుకొంటే...నిజంగా చేద్దామని దిగేసరికి అదీ చేయలేం. అవునా? అవునా!" అంటూ ప్రశ్నిస్తారు రామయ్యగారు. ఎవరు సమాధానం చెప్తారు? ఎదురుగావున్న నేనుమాత్రం ఏంచేస్తాను?...లా చదువుకొందుకి రైలులో పట్నంపోతూ, మధ్యలో ప్రేమలోపడి మధ్యలోనే రైలుదిగిపోయిన మామయ్యకొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఉద్యోగంలో అంతో యింతో సంపాదించి రిటైరైన రామయ్యగారి హృదయం కొడుకు అభివృద్ధికోసం తహతహలాడుతూంది. అభివృద్ధి నాకొద్దు; ఆడదాని సాన్నిహిత్యం నాక్కావాలి: అంటూంది గోవిందం హృదయం. అక్కడచేరి మాటలు వింటున్న నాబోట్ల హృదయం- మనకి ఉద్యోగం లేదు; రిటైరయే అదృష్టమెక్కడ? అయినా జీవించాలనే కోర్కెలతో-హృదయం తహతహలాడుతుంది. ఈ హృదయమే లేకుంటే ఎంతహాయి!

కథానిక

# విచిత్ర సంఘర్షణ

"శ్రీనివాస్"

వనజకి వరించిన వరుడితోటే వివాహం అయింది.

బాల్యంనాటి స్నేహితులంతావచ్చి బహుమతులు అందజేస్తున్నారు. తర్వాత అంతా విందు నారగించి వనజవద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతున్నారు.

కాని తన హృదయంలో చలించి, తనలో వెఱ్ఱి తలలెత్తించిన రాము అంతవరకు రాలేదు... అతనికోసం ఆమె తీరనివ్యథతో క్షోభిస్తోంది. అంతవరకు అతను రాకపోవటానికి కారణం అవగతం కావటంలేదు. మరల పదే పదే మరుపురాని మెలుకువల్తో...ఆమె హృదయం నిరీక్షిస్తోంది. అతడు రాలేదేఅన్న అనుమానంతో తల్లడిల్లిపోతోంది.

వెనువెంటనే చెదరిన చీకట్లమధ్య బెదిరిన గుండెల్తో...బరువైన హృదయవ్యథతో భారంగా "రమణా" అని పిల్చింది...